# వాళ్లిద్దరూ, మధ్య నేనూ

రాత్రి ఎక్కువ భాగం ఆలోచనలతో గడిపేశా నేమో నిద్ర లేచేసరికల్లా దూరంగా సముద్రం లోంచి సూర్యుడు పైకి వస్తున్నాడు. అప్పుడే పదుగురి కంటా పడుతున్న సూర్యుడికి దిష్టి తీయటానికే ప్రకృతి మాత పట్టుకున్న ఎర్ర నీళ్ళ పళ్ళెంలా ఉంది సముద్రం.

రానున్న నాలుగు జాములూ ప్రపంచానికి కర్మ సాక్షి అయి, సాయంకాలానికల్లా ముఖం ఎర్రగా చేసుకుని బిరబిరా వెళ్ళిపోతాడు సూర్యుడు. ప్రొద్దుట, సాయంత్రం ఒకే సూర్యుడు; ఒకే ఎర్రదనం. కానీ స్వభావంలో భేదముంది. ప్రొద్దుటిది పురిటి బిడ్డ లాంటి ఎర్రదనం. సాయంత్రానిది అగ్నిజ్వాల లాంటి ఎర్రదనం. సూర్యుడి ప్రయాణం ఒక పగలు; మానవుడి ప్రయాణం ఒక జీవితకాలం. ఈ ప్రయాణంలో సూర్యుడికి చీకటి అడ్డు రాదు. మానవుడికి చీకటి అడ్డు కాదు. పైగా కొన్ని బతుకులకు చీకట్లో తడువుళ్ళాటే మిగులుతుంది.

ప్రభాకరం, సువర్చల తలుపు చాటలో ఎదుట నిలిచారు. నాలుగు రోజులుగా వాళ్ళిద్దరే నా మనస్సును ఆక్రమించుకున్నారు. వాళ్ళిద్దరిని గూర్చిన ఆలోచనలే నన్ను అనుక్షణం వెంటాడుతున్నాయి.

ప్రభాకరం నుంచీ, సువర్చల నుంచీ ఒకేసారి రెండు శుభ లేఖలు వచ్చిన రోజున నేనెంతో మురిసిపోయాను. ఇద్దరూ వేరే వేరే ఊళ్ళలో నా దగ్గిర చదువుకున్నారు. అనుకోకుండా నా శిష్యులిద్దరు భార్యాభర్తలు అవుతున్నారని ఎంతో సంబరపడ్డాను. ఇద్దరి తత్త్వాలూ నేనెరిగినవే. పున్నమి వెన్నెల లాంటి రెండు మనసులు ఒకటవుతున్నాయని ఎంతో సంతోషించాను.

'పున్నమి చంద్రుడికే గ్రహణం పడుతుంది.' కొరడా ఛెళ్ళు మన్నట్టు మరొక ఊహ హృదయాన్ని తాకింది.'

పరధ్యానంతోటే కాలకృత్యాలు పూర్తి చేసుకుని, కొబ్బరి తోపుకి బయలు దేరాను.

రిటైరై, భీమునిపట్నానికి మకాం మార్చినప్పటినుంచి ప్రొద్దుట కొబ్బరి తోపుకి వెళ్ళి, చెట్లు చూసుకుని, జీతగాడికి ఏమైనా చెప్పవలసింది ఉంటే చెప్పి రావటం, సాయంత్రం సముద్రపొడ్డున కొంతకాలం గడపటం నా దినచర్యలో భాగా అయిపోయాయి. ఆ చెట్లను చూస్తుంటే పిల్లలను చూసుకుంటున్నట్లుంటుంది నాకు. ఏ చెట్టు మొదట్లోనో కూర్చుని, కనిపించని సముద్రపు హోరు వినిపిస్తూ ఉంటే ఒకటి రెండు గంటలు ఏదో ఆలోచించుకుంటూ ఉండటం ఓ గొప్ప ఆనందం.

నాలుగు రోజుల క్రితం అందిన ప్రభాకరం ఉత్తరం నా గుండెను ఊచకోత కోసింది. ప్రభాకరం వ్రాసిన అంత పెద్ద కవరు అందుకుంటున్నప్పుడు నా చేతులు వణికాయి. ఉత్తరాలు చదివి మళ్ళీ కవరులో పెడుతున్నప్పుడూ వణికాయి. రెండు సార్లూ ఉత్కటమైన అనుభూతిని భరించలేని వార్ధక్యమే వణకుకు కారణం. అయితే మొదటిది సుఖానుభూతి, రెండవది బాధానుభూతి.

గంటస్తంభం దాటి, అంగళ్ళు దాటి నడుస్తున్నాను. కుడి పక్క కొండమీది కోవెల నుండి ఉండీ ఉండీ ఘంటా ధ్వనులు వినిపిస్తున్నాయి. భగవంతుణ్ణి ఏమిటో వేడుకుంటున్న ఉన్మత్త భక్తుడి కంఠధ్వని లాగా ఒక్కొక్కసారి పెద్దగా, మరో సారి మరీ పెద్దగా, ఇంకోసారి చిన్నగా వివిధ స్థాయిలలో వినిపిస్తున్నాయి.

ఆలోచనలతోనే తోపు చేరాను. కాయలు గుత్తులు గుత్తులుగా ఉన్నాయి. హోరుగాలికి ఆకులు ఊగులాడిపోతుంటే, కొబ్బరి చెట్టుమాత్రం తెచ్చిపెట్టుకున్న ధైర్యంతో నిశ్చలంగా నిల్చోటానికి



ప్రయత్నిస్తున్నాయి. ఇసుకలో కూర్చున్నాను.

ఈనాడు ప్రభాకరం నరాల్లో ప్రవహిస్తున్న అశాంతికి కారణం ఎవరు? సువర్చల గురించి కఠినంగా ఆలోచించటానికి మనసు ఎదురు తిరుగుతున్నది. సువర్చల ప్రవర్తనకు కూడా తప్పక ఏవో కారణం ఉంటుంది. దానికి ప్రభాకరం కారణమని నేను ఒప్పుకోను. ఏది ఎలా జరగాలో అది అలా జరగక తప్పదు. పని మానవుల వంతు; ఫలం భగవంతుని ఇష్టం. 'కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన' అంటాడు కృష్ణ పరమాత్మ.

> **సముద్ర కెరటాలు వచ్చి ఇసుకను తడుపుతూనే ఉంటాయి. అంతలో తడి ఆరిపోతుంది. మళ్లీ అదే అలలకు తడుస్తూంటుంది. నీరు ఇంకిపోతూన్నా సముద్రంలో నీరు తరగదు. అనుభవాల వేడికి ఎంత కన్నీరు ఇంకిపోయినా ఇంకా కన్నీరు పుడుతూనే ఉంటుంది. కర్మఫలం మీద మానవుడికి అధికారం లేదు కానీ బాధ్యత తప్పకుండా ఉంది.**

"మాస్టారూ!"

ఊహల్లో కూరుకుపోయిన నేను పరిచిత కంఠం వినిపించి తలెత్తి చూశాను. ఎదురుగా ప్రభాకరం కనిపించాడు. ముఖం వెంటనే గుర్తుపట్టలేనంతగా మారిపోయింది. ప్రయాణపు బడలిక వల్ల కాబోలు మరింత కళ తప్పి ఉన్నాడు.

"రావోయ్, రా! ఇప్పుడేనా రావటం? ఇంటికెళ్ళి వస్తున్నా వేమిటి? ..."

నా మాటలు అర్థాంతరంగా ఆగిపోయాయి. 'అంతా కులాసా?' అని రాబోయిన ప్రశ్న ప్రశ్నలానే గొంతులో నిలిచిపోయింది. అనుకోకుండా నా కళ్ళు అతని ముఖం నుంచి మరలి వాలిపోయాయి.

"ఊఁ!"

నీరసంతో మూలిగినట్లు ఉంది తప్ప, అది మాటలా లేదు. ఉన్నా, అది నా ప్రశ్నల్లో దేనికి సమాధానమో తెలియదు.

ప్రభాకరమే మళ్లీ అన్నాడు: "అలా అలల వెంబడి కొద్ది దూరం వెళదాం రండి, మాస్టారూ!"

ప్రభాకరం ఏవో చెప్పదలుచుకున్నట్లనిపిస్తున్నది.

తోపులోనుంచి ఇసుక మేట దాటి సముద్రపు ఒడ్డుకు వచ్చాము. ప్రభాకరం ముందు నడుస్తున్నాడు. నేను వెనక అడుగు వేస్తున్నాను.

రెప్పలు దాటలేని కన్నీటిలాగా చెలియలి కట్ట దాటలేని సముద్రపు నీరు గింజుకుంటున్నది. బెస్తవాళ్ళ పడవలు దూర దూరాలకు సాఫీగా సాగిపోతున్నాయి. తీరానికి చేరుతున్న నీరే ఎగిసెగిసి పడుతున్నది. లోపల అంతా ప్రశాంతత.

నిండా మునిగిన ప్రభాకరం తాపీగా నడుస్తున్నాడు. పక్కన ఉన్న నేనే ఊహల కెరటాల నాపలేకపోతున్నాను. ప్రభాకరాన్ని ఏమీ అడిగే ధైర్యం నాకు లేదు. ఏమి అడిగితే ఏమి వినవలసి వస్తుందో అనే భయం పట్టుకు పీడిస్తున్నది.

'ఇంత లేతవయసులో ప్రభాకరానికి ఇంతటి వ్యాకులత ఎందుకు వ్రాసి పెట్టాడో, భగవంతుడు!'

పైన వెలుగుతున్న సూర్యుడి ప్రతిబింబం సముద్రంలో కనిపించటంలేదు. నీరంతా వెండిరేకులు పరిచినట్లున్నది.

ప్రభాకరం నాకు వ్రాసిన ఉత్తరాలు గుండెలో చిందరవందరగా పడి రెపరెపలాడుతున్నట్లయింది.

ఒకే రోజు వచ్చిన ఆ ఉత్తరాలన్నీ ప్రభాకరం ఒకే రోజు వ్రాసినవి కావు. ఎన్నాళ్ళుగా వ్రాస్తూ ఉన్నాడో — ఆ నాడు పోస్టు చేశాడు. ఆ ఒక్క విషయం చాలు — ప్రభాకరం అనుభవించిన మానసిక చిత్రహింసను వ్యాఖ్యానించటానికి. అపును, పిడికెడు గుండెలో ఎంత బాధనని ఇముడ్చగలము? అది ఎలానో బయటకు రాకపోతే, దాని ఒత్తిడి గుండెను బద్దలు కొడుతుంది.

ప్రభాకరం లైట్‌హౌస్ దాటి నడుస్తున్నాడు. అతణ్ణి ఆలోచనలు నడుపుతున్నాయి. నన్ను అతడు నడుపుతున్నాడు.

ప్రభాకరం ఉత్తరాలు — వారి దాంపత్యాన్ని గూర్చిన నా ఊహాగానాలకూ, వాస్తవికతకూ శ్రుతి కలవలేదని తెలిపాయి. ఆనందపు జల్లు పడుతుందనుకున్న సమయంలో నిజం అనే పెను గాలులకు తలపుల మబ్బులు చెల్లాచెదరయ్యాయి. సువర్చల నుంచి తాను

## పాలపర్తి వేణుగోపాల్

ఆశించిన అనురాగం కరువయిందనీ, కారణం తెలియని ఈ పరిణామం నానాటికీ తనలో అశాంతి రేకెత్తిస్తున్నదనీ ప్రభాకరం ఉత్తరాల సారాంశం. ఉత్తరాలు చదువుతుంటే, బాధను కుమ్మరించి దానిలో కలం అద్ది వ్రాసిన ట్లనిపించింది.

ముందు ప్రభాకరం, వెనక నేను, కుడి పక్కన భయంకరంగా సముద్రం, ఎడమ పక్కన జాలిగా పెద్ద భవనం.

శిథిలమై నసపోర్చుగీసు మేడవైపు చూస్తున్నాడు ప్రభాకరం.

ఒకప్పుడు ఆఫీసర్లతో, జవాన్లతో అది కళకళలాడుతూ ఉండేదట మొన్న మొన్నటిదాకా, ఊరు చూడవచ్చిన పెద్ద బ్యాండాలకు దాన్ని విడివిగా ఇచ్చే వారు. ఇప్పుడది లేదు. ద్వారాలకు ముళ్ళ తీగలు తగిలించారు.

వంపు తిరిగిన ఆ భవనపు ప్రహరీ పక్కగా ఇసుకమీద నడుస్తున్నాము. తేమమీద ఉందేమో — నల్లటి ఇసుక పాదాలకు పూత పూస్తున్నది. కళ్ళద్వారా మనస్సుకు ఒక విధమైన గరగర వినిపిస్తున్నది. ఆ శబ్దానికి ఒళ్ళు జలదరిస్తున్నది.

బెస్తవాళ్ళ పడవమీద ఉప్పుటేరు దాటి ఇసుకలో దిగాము. పక్కనే నీళ్ళలో ఒక రాయి ఉంది. రకరకాల ఆనందాల్లాంటి రంగు రంగుల గవ్వలతో చేసినట్లు జీవితం వంటి నీళ్ళలో అందాలు ఒలుకుతూ ఉంది. ఆ రాయి మీద కాలు పెట్టాడు ప్రభాకరం.


ప్రవహించే నీళ్ళలో ఒక సన్నని రాగ రేఖ కనిపించి అలుముకుని క్షణంలో సమసిపోయింది. ప్రభాకరాన్ని చూస్తుంటే జాలి వేసింది.

నాలుగు వైపులా నీరు. రాత్రి పడిన గాలికి ఇసుక మీద అలల లాంటి చారలు ఏర్పడ్డాయి. అతి కళాత్మకంగా ఉన్న ఆ చారల మీద మా పాదాలు రాక్షసంగా పడుతున్నాయి. ఊరు చూడటానికి వచ్చిన పైవాళ్ళు తప్ప ఊళ్ళోవాళ్ళెవరూ సాధారణంగా ఇటు రారు.

కొద్ది దూరం నడిచి, గుండెలో దాచుకున్న బాధలా అనంతమైన సముద్రాన్ని ఎదుట పెట్టుకుని కూర్చున్నాడు ప్రభాకరం. కొద్ది దూరంలో నేనూ కూర్చున్నాను.

ఉప్పుటేరులో కాస్త ఎగువన **ఒక**

జలక్రీడ — ఫోటో— ఎమ్. నాగేశ్వరరావు ( తెనాలి )



బెస్త చేతిలో వల పట్టుకుని ప్రవాహం వైపే చూస్తున్నాడు. సముద్రం లోంచి అల వచ్చినప్పుడు ఒక్కొక్కసారి ఒక గుంపుగా చేపలు వస్తాయి. అవి రాగానే వల విసురుతాడు. ఒక్కటి తప్పించుకు పోకుండా అన్నిటినీ వలలో చిక్కించు కుంటాడు.

ప్రభాకరం నావైపే చూస్తున్నాడు. చూస్తూనే జేబులో నుంచి ఒక కవరు తీశాడు. "సువర్చల మీకు వ్రాసింది." మాటలు కూర్చుకుంటున్నట్లు అన్నాడు.

కవరు చూడగానే నాకు శ్వాస వేగం పెరిగింది. దీనిలో ఏం చూడబోతానో అనిపించి ఒళ్లంతా వణుకు ఆవరించింది.

కవరు తీసుకున్నాను. సువర్చల మనసును నిడమరిచే ఉత్తరం నా చేతుల్లో ఉంది. 'దీనితో వాళ్ల స్థితిని నేను మెరుగుపరచగలనేమో?' ఒక వైపు ఆవేశం, మరోవైపు ఆశ కల్లోలపరుస్తూ ఉండగా కవరు చించి ఉత్తరం విప్పాను.

"మాస్టారు గారికి —

నమస్కారాలు.

నా ఉత్తరం మీకు ఆనందమే కలిగించవచ్చు. కానీ, ఈ ఉత్తరం మాత్రం అలా కాదు. ఇది మీకు కల్పించే క్షోభకు నన్ను మనసారా క్షమించ గోరతాను."

చదవబోయే విషయాలు తెలియకుండానే నన్ను భయం ఆవహించింది.

"నేను చాలా విపరీతమైన పరిస్థితుల్లో జీవిస్తున్నాను. నేను మనశ్శాంతి పోగొట్టుకుని, మరొకరికి పోగొట్టి బతుకుతున్నాను."

చూపుల గుర్రాలతో నా మనసు రథం అక్షరాల బాట మీద పరిగెత్తుతున్నది.

"మీ మీద మా ఇద్దరికీ ఉన్న గౌరవభావం మా ఆత్మీయతను పెంచింది."

నా ప్రసక్తి రావటంతో ఇంకా గబగబా చదవసాగాను.

"మీరు మా మధ్య ఉన్నప్పుడు మా కేదో జన్మాంతర సంబంధం ఉన్నట్టు అనుభూతిని నేను పొందేదాన్ని. నా కళ్లు కృతజ్ఞతతో మెరిసిపోయేవి.

"పెళ్లికి వచ్చినప్పుడు అవీ ఇవీ మాట్లాడుతూ మీరు వసుంధర టీచర్ సంగతి చెప్పారు. ఆమె పెళ్లిచేసుకుని, కాన్పు కష్టమై చనిపోయా రన్నారు."

ఒక కెరటం నా కాళ్ల కిందికి వచ్చింది. అక్కడి నుంచి లేవా లనిపించ నంతటి నిస్సత్తువ ఆవరించింది. లోపలకు వెళ్ళుతున్న నీరు పాదాల కింద ఇసకను నాకు తెలియకుండా లాక్కుపోతుంటే పాతాళంలోకి కూరుకుపోతున్న ట్లనిపించింది.

"నన్ను నేను ఎంతగానో వసుంధర టీచర్‌తో పోల్చుకునేదాన్ని. ఆమె అంటే నాకు ఎంతో గౌరవం ఉన్నది. ఆమె ఆశయాలూ, ఉద్దేశాలూ నన్ను ముగ్ధురాలిని చేస్తాయి. అయినా ఫరవాలేదు, మాస్టారూ! అవి నా జీవితంలో పాలు పంచుకున్నాయి. అవి బ్రతుకు బాటలో కొంతదూరం చేయూత ఇచ్చి నన్ను నడిపించాయి. ఒకప్పుడు ఉద్దేశపూర్వకంగా నేను ఆమెను అనుసరించాను. ఇప్పుడు ఇంక నా ప్రమేయం లేకుండానే నేను ఆమెను అనుసరిస్తానేమో? ఆ భావంతో నాలోని ప్రత్యణువూ వణికిపోతున్నది. అర్థం కాని విచారం ఆవహిస్తున్నది. ఆపైన నిశ్చేష్టత పొందుతాను."

ముందు ఉప్పు సముద్రం మీదికి వచ్చి పడుతున్నట్లూ, ప్రపంచాన్నంతా పెనుచీకట్లు తింటున్నట్లూ, ఎవరో గుండె పిండుతున్నట్లూ అనిపిస్తున్నది.

"ఆలోచిస్తే ఒక్కొక్కసారి నాకూ అనిపిస్తుంది — నా భయం ఎంత నిరాధార మయిందో అని. దాని ఆధిక్యం నేను కల్పించుకున్నదే కావచ్చు. కానీ అది నన్ను ఊపివేస్తుంది. ప్రపంచంలో కోటానుకోట్ల ఆడవాళ్ళున్నారు. వాళ్లందరికీ లేని భయం నా కెందుకో! కానీ, నేను మనస్సును గెలవలేను, మాస్టారూ! ఈ విషయం వారితో చెప్పలేను. భయం వదలలేను. మరో వైపు — వారికి వేదన కలిగిస్తున్నాననే భావం నన్నింకా కుంగదీస్తున్నది. ఈ పరిస్థితి వారికి అశాంతి కలిగిస్తుందని తెలుసు. భార్య కారణంగా శాంతి లేని మగవాడి హృదయం కుమిలిపోతుందనీ ఎరుగుదును. కానీ, నే నేం చెయ్యలేను. మనస్సు విప్పి మాట్లాడను కూడా లేకపోతున్నాను. నా ఈ స్థితికి ఎవ్వరూ కారణం కారు. మీరు ఎప్పుడూ చెబుతూ ఉండేవారు — పని చేయడమే మనిషి వంతు; ఫలితం అతని చేతుల్లో ఉండేది కాదని. నిజం! వసుంధరగారు మరణించడం అనుకోని సంఘటన. మీరు ఆ విషయాన్ని చెప్పటం కేవలం యాదృచ్ఛికం. నేను పదే పదే అదే తలుచుకుని కుంగిపోవటం బలహీనత.

"నాలో దాచుకోవటానికి శక్తి లేక వ్రాశాను. ఏమీ అనుకోవద్దు, మాస్టారూ!

"నమస్కారాలతో —

మీ శిష్యురాలు...

—సువర్చల."

మెదడు మొద్దుబారిపోయింది. ఒక్కసారి నరాల్లోనూ నిస్సత్తువ ప్రవహించినట్లయింది.

ఉత్తరం మడుస్తున్నాను.

"సువర్చల ... చచ్చిపోయింది."

అదిరిపడ్డాను. ప్రభాకరం నెమ్మదిగా అన్న ఆ మాటకు శతకోటి సముద్రాలు నా చెవుల్లో హోరెత్తుతున్న ట్లయింది.

అతనే మళ్లీ అన్నాడు: "ఒక విధంగా అదే నయమేమో, మాస్టారూ!"

ఆ మాటలో బాధ లేదు. తీక్ష్ణతా లేదు. భావ శూన్యంగా ఉంది ఆ గొంతు.

అతనివైపు చూశాను. కళ్లు నిర్జీవంగా ఉన్నాయి. చూపు నిలుపుకోలేక మరో వైపు తిప్పాను.

కెరటాలు ప్రతి నిమిషం కొత్త ఇసకను తడుపుతున్నాయి. ఆ ఇసక ఆరిపోతున్నది. మళ్లీ అదే తడుస్తున్నది. మళ్లీ అదే ఆరుతున్నది. సముద్రంలో నీరు ఇట్లా కొద్ది కొద్దిగా యుగయుగాలుగా ఇంకిపోతున్నా, నీరు మాత్రం తరగదు. అనుభవాల వేడికి ఎంత కన్నీరు ఇంకిపోయినా, ఇంకా కన్నీరు పుడుతూనే ఉంటుంది.

"సువర్చల చచ్చిపోతే నేను ఏడవలేదు. తను నన్ను భర్తగా చూడక పోవటం మాత్రం దానికి కారణం కాదు. దేనివల్లనో సువర్చల మనస్సు బాగా దెబ్బ తిన్నది. ఆమె అంటే నాకు సానుభూతి ఉంది. కానీ, తన బాధను నేను పంచుకో కూడదనే స్వభావమే నన్ను కష్టపెట్టింది ... ఏమైనా... తన బాధనుంచి శాశ్వతంగా ప్రశాంతి పొందింది."

ప్రభాకరం గొంతులో తొణికిన బొంగురుతనం నాలో ఆశ్చర్యం నింపింది.

ప్రభాకరం నా దగ్గర చదువు నేర్చుకున్నాడు. కానీ, మనిషిలో ఇంత ఉదాత్త ఉంటుందని నే నెప్పుడూ ఊహించని విషయాన్ని ప్రభాకరం నాకు ప్రత్యక్షంగా నేర్పాడు. అతని ఉన్నత సంస్కారం నన్ను వివశుణ్ణి చేసింది.

నా చేతిలోని ఉత్తరం చదవమన్నట్లుగా అతనికి అందించాను.

ప్రభాకరం చదువుతున్నాడు.

సువర్చల చనిపోయినందుకు నాకు దుఃఖం పొంగి పొర్లింది. ప్రభాకరాన్ని సువర్చల దక్కించుకోలేకపోయినందుకు నాకు దుఃఖం పొంగి పొర్లింది.

'సువర్చల లాగానే ప్రభాకరం కూడా నన్ను క్షమిస్తాడు. కానీ, నేను క్షమార్హుణ్ణి కాను. వాళ్ల ఎడబాటుకు నేనే కారణం—' పిచ్చి ఆవేశం నన్ను కమ్మివేసింది.



తల్లీ పిల్లలు

చిత్రం— పి. ఆగాచార్య (కరీంనగర్)

ప్రభాకరం ఉత్తరం పూర్తిచేసి సజల నయనాలతో ప్రశాంతంగా నన్ను చూశాడు.

ఆ కళ్లలో నాకు అత్యున్నత వేదాంత తత్త్వం కనిపించింది. వాటిలోని సానుభూతి కిరణాలను నేను భరించలేకపోయాను. "కర్మ ఫలం మీద మానవుడికి అధికారం లేదు కానీ, బాధ్యత తప్పకుండా ఉంది." పిచ్చిగా అరుస్తూ పడవ వైపు కదిలిపోయాను. ☆